క్లుప్తంగా

గురుకుల అధ్యాపకుడికి డాక్టరేట్



మహేందర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

నాగార్జునసాగర్ : మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న మహేందర్‌కు ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన మహేందర్‌ను శుక్రవారం కళాశాల అధ్యాపకులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలని వినతి



జానారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఉద్యమకారులు

నాగార్జునసాగర్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నాగార్జునసాగర్ తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని ఇప్పించే బాధ్యత తీసుకుంటానని మాజీ మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాయితి జానకిరెడ్డి, మాజీ కౌన్సిలర్ హిరేకార్ రమేష్‌జీ, సభావత్ చంద్రమౌళి, సిరికొండ మధు, చరక యాదగిరి, వెంకోజీ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న బంటు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ : కేంద్రం తీసుకొచ్చిన మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని, విత్తనాలను సబ్సిడీపై అందించాలని కోరారు. పంటను నిల్వ చేసుకునేందుకు గోదాములు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్, నాయకులు ధనావత్ శాంత, ధీరావత్ లింగానాయక్, జమ్ముల కోటయ్య, లక్ష్మయ్య, సైదులు, పోలేపల్లి లక్ష్మయ్య, పున్నయ్య, దావీదు, సైదమ్మ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ పూజలు



మిర్యాలగూడ టౌన్ : గాంధీనగర్‌లోని శ్రీకనకదుర్గ ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



మిర్యాలగూడ టౌన్ : కనకదుర్గ ఆలయంలో మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు



పెద్దవూర : శ్రీదుర్గా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో..



పెద్దవూర : వరలక్ష్మీ వ్రతం చేస్తున్న భక్తులు



హాలియా : వేంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతం నిర్వహిస్తున్న మహిళలు



గుర్రంపోడు : వేంకటేశ్వర ఆలయంలో..

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగార్జునసాగర్‌లోని ఆయన నివాసంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డితో కలిసి ప్రజారోగ్యశాఖ, మిషన్ భగీరథ, ఎన్పీడీసీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి పల్లెలో రోగులకు కావాల్సిన మందులను ఆశావర్కర్ల ద్వారా అందించాలని సూచించారు. వ్యవసాయ రంగానికి అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలని పేర్కొన్నారు. లో ఓల్టేజీ సమస్య లేకుండా అవసరమైతే అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఎక్కడైనా సబ్ స్టేషన్‌లు అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ అధికారులు, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి

మిర్యాలగూడలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మిర్యాలగూడ : జిల్లాలో భారీ వర్షాపాతం దృష్ట్యా ఇండియన్ మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ నుంచి జారీ చేసిన హెచ్చరికల మేరకు మిర్యాలగూడ డివిజన్ పరిధిలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్‌ను సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బంది ఎదురైనా 08689-295001 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఓ శ్రీనివాస్‌శర్మ, సిబ్బంది సయ్యద్ జమాల్, ఎండీ.అబ్బాస్ తదితరులు ఉన్నారు.



కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

అపోహలు నమ్మవద్దు

గుర్రంపోడు : రాఖీ పండుగపై సోషల్ మీడియాలో వస్తున్న అపోహలు నమ్మవద్దని జిల్లా బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, పురోహితుడు అన్నెపర్తి శివాజీ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాఖీలు ఫలానా సమయంలో కట్టుకోవాలనే నిబంధనలు ఏమీ లేవని పేర్కొన్నారు. ప్రజలందరూ వీలైన సమయాన్ని బట్టి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎప్పుడైనా రాఖీ కట్టుకోవచ్చునని తెలిపారు.

నేడు నీటి సరఫరా నిలిపేత

దేవరకొండ : దేవరకొండ పట్టణానికి శనివారం మంచినీటి సరఫరా నిలిచిపోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఏపల్లి మండలం కోదండాపురం వాటర్ ప్లాంట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనుల కారణంగా నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మందులు పంపిణీ చేస్తున్న కమిషనర్ సుదర్శన్

దేవరకొండ : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ సిబ్బందికి బొడ్డుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం కార్మికులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, మేనేజర్ రాకేష్, సక్రునాయక్, జగమంతు ఉన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

హాలియా : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ సాయి ప్రశాంత్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మిషన్ పరివర్తన్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో మిషన్ ఆర్ఆర్ఆర్, రోడ్డు సేఫ్టీపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రహదారి భద్రతా కమిటీని ఏర్పాటు చేసి ట్రాఫిక్, క్రమశిక్షణ, ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎంఎల్‌హెచ్‌పీ మంజుల మాట్లాడుతూ సీపీఆర్ పద్ధతిపై అవగాహన కల్పించారు. పోలీస్ కళాబృందం సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు రహదారి భద్రతపై వివరించారు. కార్యక్రమంలో డీటీఆర్‌బీ హెడ్ కానిస్టేబుల్ రాజు, హెడ్ కానిస్టేబుల్ అబ్బగోని యాదయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ సాయి ప్రశాంత్

భగీరథ పైపులైన్ లీకేజీ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడెం(ఏనేమీద)లో మూడు రోజులుగా మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని స్థానికులు అధికారులు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. కానీ, మిషన్ భగీరథ అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో నీరు రోడ్లపై ప్రవహించడంతో ఒక వైపు పాదాచారులు, మరో వైపు వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందించినట్లు పేర్కొన్నారు. కనీసం రోడ్లపై ప్రవహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఈ విషయం ఎవరికి చెప్పాలో తెలియడం లేదని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి నీటి లీకేజీని వెంటనే అరికట్టాలని కోరుతున్నారు.



మిర్యాలగూడలోని ఈదులగూడలో పైపులైన్ నుంచి లీకవుతున్న నీరు

బహుజన వీరుడు పండుగ సాయన్నకు నివాళి





మిర్యాలగూడ టౌన్ : బీసీ బాలుర హాస్టల్‌లో పండుగ సాయన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నేతలు

మిర్యాలగూడ టౌన్ : నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి, బహుజన వీరుడు పండుగ సాయన్న అని బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ తరుణ్‌కుమార్, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి దుర్గయ్య, యువజన సంఘం నాయకులు దోనేటి శేఖర్, చంటి, గోపిచంద్, సాయి కిరణ్, జానకిరాముడు, కార్తీక్, గణేష్, జీవన్, వాసు, సాయి, అజయ్ తదితరులు ఉన్నారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో..

భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమించిన పోరాటయోధుడు పండుగ సాయన్న అని బీసీ సంఘాల నేతలు కోల సైదులు, కస్తూరి ప్రభాకర్, పెద్ది శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల బీసీ భవన్‌లో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దాసరాజు జయరాజు, మురళియాదవ్, మహేష్‌గౌడ్, శిరసనగండ్ల ఈశ్వరాచారి, బంటు రమేష్, గిరిజన ఉద్యోగుల సంఘం నేత మాలోతు దశరథనాయక్ తదితరులు ఉన్నారు.

జోరువాన



పెద్దవూర : చిన్నవాగు వంతెన పైనుంచి వెళ్తున్న వరద



పెద్దవూర : అలుగు పోస్తున్న పెద్దవూర చెరువు



తిరుమలగిరి : వద్ద పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు



తిరుమలగిరి (సాగర్) : మండల కేంద్రం పరిధిలో నీటమునిగిన వరి పంట

ఆమలూరులో మంచినీటి సమస్య

గుర్రంపోడు : మండలంలోని ఆమలూరు గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతోపాటు మంచినీటి బోరు పనిచేయకపోవడంతో నీటి సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నా మరమ్మతులు చేయడంలేదని ప్రజలు వాపోతున్నారు. చేసేదేమీ లేక గ్రామస్తులు వ్యవసాయ బోర్ల వద్ద నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు పనులను శుక్రవారం చేయించామని, శనివారం నుంచి నీరు అందుతుందని తెలిపారు. అలాగే మంచినీటి బోరును కూడా మరమ్మతు చేయిస్తామని పేర్కొన్నారు.

ఓట్ల తొలగింపును నిలిపివేయాలి

దేవరకొండ : బిహార్ రాష్ట్రంలో ఓట్ల తొలగింపు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దేవరకొండ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో నల్లజెండాతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓడపల్లి యాదగిరి, బిజిలి లింగయ్య, నల్ల శ్రీను, బుడిగ వెంకటేష్, నల్ల రామస్వామి, ఎండీ. రహీం, నరసింహ, అంకులయ్య తదితరులున్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అన్నాచెల్లెల్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



మిర్యాలగూడ : షైనింగ్‌స్టార్ విస్డం స్కూల్‌లో ఒకరికొకరు రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు



పెద్దఅడిశర్లపల్లి : శ్రీ సాయి కృష్ణవేణి పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

మిర్యాలగూడ : అన్నాచెల్లెల్ల అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పాఠశాల కరస్పాండెంట్ కుర్ర కాంతి, డైరెక్టర్ వినోద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని షైనింగ్‌స్టార్ విస్డం పాఠశాలలో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు.. విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, సోమయ్య, కుసుమ, కాంతమణి, మంగమ్మ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయి కృష్ణవేణి పాఠశాలలో..

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలోని శ్రీ సాయి కృష్ణవేణి పాఠశాలలో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు.. విద్యార్థులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రారెడ్డి, రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుబంధానికి ప్రతీక రాఖీ

హాలియా : రాఖీ పండుగ అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య అనుబంధానికి ప్రతీక అని న్యూకిడ్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మనాది శ్రీలతరవీందర్ అన్నారు. రాఖీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో ఒక రోజు ముందస్తుగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హాలియా : న్యూకిడ్స్ స్కూల్‌లో రాఖీ కట్టుకుంటున్న చిన్నారులు